క్లుప్తంగా

నేడు శివ పార్వతుల కల్యాణోత్సవం

పెద్దతిప్పసముద్రం: స్థానిక శ్రీ పార్వతీ సమేత విరూపాక్షేశ్వర స్వామి ఆలయంలో బుధవారం శివ పార్వతుల కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు ససగరం పట్టాభి రామయ్య తెలిపారు. శివుని జన్మ నక్షత్రం, ఆరుద్ర జన్మ నక్షత్రం సందర్భంగా జరిగే కల్యాణోత్సవానికి భక్తులందరూ హాజరై స్వామి వారి తీర్థ ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

అధ్యాపక పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

మదనపల్లె సిటీ: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో కంప్యూటర్ అప్లికేషన్స్ అధ్యాపక పోస్టుకు అర్హులైన మహిళలు దరఖాస్తు చేసుకోవాలని కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ క్రిష్ణావేణి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్సీ కంప్యూటర్స్, ఎంటెక్ కంప్యూటర్ సైన్సు, ఎంసీఏ చేసిన వారు పీజీలో 55 శాతం మార్కుల ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్, ఏపీ సెట్‌లో అర్హత సాధించిన వారికి ప్రాధాన్యత ఉంటుందన్నారు. అభ్యర్థులు మార్చి 5లోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు.

యుటీఎఫ్ జిల్లా కౌన్సిలర్లుగా రమణ, సుధాకర్


రమణ


సుధాకర్

మదనపల్లె సిటీ: యుటీఎఫ్ జిల్లా కౌన్సిలర్లుగా మదనపల్లెకు మదనపల్లె అర్బన్‌కు చెందిన వెంకటరమణ, రూరల్ పరిధిలోని సుధాకర్‌నాయుడులను ఎన్నుకున్నట్లు యుటీఎఫ్ నాయకులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తామని ఎంపికైన వారు పేర్కొన్నారు.

శ్రీగంధం సాగుపై దృష్టి సారించండి

కలికిరి: శ్రీగంధం సాగుపై రైతులు దృష్టి సారించాలని కేవీకే కో–ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ, ఇంటియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫుడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ శాస్త్రవేత్త గిరిబాబు అన్నారు. మంగళవారం కేవీకే ఆధ్వర్యంలో శ్రీగంధం సాగుపై రైతులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీగంధం సాగుకు ముందుగా నర్సరీలు మొక్కల ఎంపిక, నాటే పద్ధతి, చెట్లు మధ్య దూరం, అతిథేయ మొక్కలు, ఎరువులు, నీటి యాజమాన్యం తదితర అంశాలపై రైతులకు వివరించారు. అలాగే శ్రీగంధం ఉపయోగాలు, వాటి ఉత్పత్తుల వాడకాలపై ఐడబ్ల్యుఎస్టీ సీనియర్ టెక్నీషియన్ మంజునాథ్ తెలిపారు. కార్యక్రమంలో కేవీకే శాస్త్రవేత్తలు పీరుసాహెబ్, శ్రీనివాసులు, మాధురి, ఐడబ్ల్యుఎస్టీ శాస్త్రవేత్త మమత పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

నిమ్మనపల్లె : అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద నుంచి 60 లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ ఫాతిమా తెలిపారు. మండల పరిధిలోని అగ్రహారం గ్రామానికి చెందిన కామిశెట్టి శ్రీనివాసులు గత కొంత కాలంగా అక్రమంగా నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం అందింది. మంగళవారం హెడ్‌కానిస్టేబుల్ చక్రవర్తి పోలీస్‌సిబ్బందితో కలిసి అగ్రహారం సమీపంలో నాటుసారా విక్రయిస్తుండగా కామిశెట్టిశ్రీనివాసులును అదుపులోకి తీసుకున్నామన్నారు. కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

పశు వైద్యశిబిరానికి స్పందన

పెద్దమండ్యం: మండలంలోని శిద్దవరం పంచాయతీ మల్లయ్యగారిపల్లెలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శిబిరంలో డాక్టర్ విక్రమ్‌రెడ్డి ఆధ్వర్యంలో 60 పశువులకు బ్యూటాక్స్ పిచికారి చేసి, గాలికుంటువ్యాధి టీకాలు వేశారు. అలాగే 20 పశువులకు గర్భకోశ వ్యాధులకు, 21 పశువులకు సాధారణ చికిత్స చేసినట్లు డాక్టర్ తెలిపారు. పశువిజ్ఞాన బడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో పశువైద్య సహాయకులు రమణనాయక్, మహేష్, పాడి రైతులు పాల్గొన్నారు.

రూట్ మ్యాప్‌ను పరిశీలించిన ఎస్పీ

మదనపల్లె: మదనపల్లె నియోజకవర్గంలో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ యువగళం పాదయాత్ర జరగనున్న రూట్ మ్యాప్‌ను మంగళవారం జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు పరిశీలించారు. యాత్ర జరగనున్న స్థలాలను తనిఖీ చేశారు. మదనపల్లె మండలంలోని కాశీరావుపేట నుంచి మదనపల్లె పట్టణంలోకి సాగే మార్గాన్ని పరిశీలించారు. సిబ్బందికి సలహాలు, సూచనలు ఇచ్చారు. కురబలకోట, బి.కొత్తకోట మండలాల్లో జరిగే పాదయాత్ర రూట్‌మ్యాప్‌లు పరిశీలించారు.

నలుగురు జూదరుల అరెస్ట్

కలకడ : మండలంలో నలుగురు పేకాటరాయుళ్లను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. వివరాలిలాఉన్నాయి. మంగళవారం మండలంలోని ఎర్రకోటపల్లె పంచాయతీ కోపూరివాండ్లపల్లె సమీపంలో పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్ఐ తనసిబ్బంది శ్రీనివాసులు,కాంతారావు, ఖలీల్‌బాష, మహబూబ్‌బాష, రాజేంద్రలతో కలిసి దాడులు నిర్వహించారు. జూదరులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.16,320 నగదు, 52పేకాట ముక్కలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విజ్ఞానంతోనే సమాజాభివృద్ధి సాధ్యం

- ఆర్డీఓ ఎం.ఎస్.మురళి
- ఘనంగా నేషనల్ సైన్స్‌డే వేడుకలు
- పలు పాఠశాలల్లో సైన్స్ ఎగ్జిబిషన్‌లు


మదనపల్లె : వైజ్ఞానిక ప్రదర్శనలను పరిశీలిస్తున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : విజ్ఞానంతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమానికి ఆర్డీఓ మురళి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. విద్యార్థుల్లో శాస్త్రీయ విజ్ఞానం అభివృద్ధి చెందేందుకు సైన్స్ ఎగ్జిబిషన్స్ ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. విద్యార్థులు తమలో దాగి ఉన్న సృజనాత్మక ఆలోచనలు బయటపెట్టేందుకు ఇటువంటి ప్రదర్శనలు వేదికలు అవుతాయని చెప్పారు. విద్యార్థులు భావి భారత శాస్త్రవేత్తలుగా తయారుకావడానికి ఉపాధ్యాయులు ఇప్పటి నుంచే ప్రోత్సహించాలని కోరారు. ఇటువంటి ఎగ్జిబిషన్లు విద్యార్థుల్లో మరింత ఉత్సాహాన్ని పెంచుతాయన్నారు. పర్యావరణం, సౌరశక్తి, సేంద్రీయ ఎరువులు, ప్రకృతివ్యవసాయం, భౌతిక, వైద్య, గణిత శాస్త్రాలకు సంబంధించి విద్యార్థులు ఏర్పాటుచేసిన పలు నమూనా ప్రదర్శనలు ఆకట్టుకున్నాయని ఆర్డీఓ ప్రశంసించారు. కార్యక్రమంలో బీటీ కళాశాల రిటైర్డ్ వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్.వి.కే. సభాపతి, చైర్‌పర్సన్స్ అమృతప్రసాద్, శ్రీదేవి, డైరెక్టర్ సయ్యద్ అహమద్, ప్రిన్సిపాల్ షెహనాజ్‌ఖాన్, మీఎస్ఆర్ గ్రాండ్ సుధాకరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

– భాష్యం పబ్లిక్ స్కూల్‌లో జోనల్ ఇన్‌చార్జ్ లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవంలో విద్యార్థులు ప్రదర్శించిన పలు వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

– బీటీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రపంచ శ్రేయస్సు కోసం ప్రపంచశాస్త్రం థీమ్ పేరుతో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

సైన్సుతోనే మానవ మనుగడ

మదనపల్లె సిటీ: సైన్సుతోనే మానవ మనుగడ సాధ్యమవుతుందని మదనపల్లె డీవైఈఓ క్రిష్ణప్ప అన్నారు. మంగళవారం స్థానిక బసినికొండ జెడ్పీ ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్సు దినోత్సవం జరిగింది. ఆయన మాట్లాడుతూ విద్యార్థులల్లో చిన్నప్పటి నుంచే వైజ్ఞానికి వైఖరులు పెంపొందించాలన్నారు. మూఢ నమ్మకాలు దురాచారాలు పాగొట్టి సైన్స్ పట్ల పిల్లలోల ఆసక్తిని తీసుకురావాలని పిలుపునిచ్చారు. విద్యార్థులు చేసిన నమూనాలను పరిశీలించి అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం శ్రీనివాసులు, ఫిజిక్స్ ఉపాధ్యాయులు భాస్కరన్, కృపానందనాయుడు, పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన సైన్సు దినోత్సవం పురస్కరించుకుని ఎగ్జిబిషన్‌ను హెచ్‌ఎం రెడ్డన్నశెట్టి ప్రారంభించారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

రామసముద్రం: రామసముద్రం మండలం మట్లవారిపల్లె ఉన్నత పాఠశాలలో జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం సైన్స్ ఎగ్జిబిషన్ నిర్వహించారు. ఉన్నత పాఠశాల పరిధిలోని 10 ప్రాథమిక, 2 ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాల కలుపుకుని దాదాపు 200 ప్రదర్శనలను విద్యార్థులు ప్రదర్శించినట్లు ప్రధానోపాధ్యాయులు నందకుమార్ తెలిపారు. విద్యార్థులు సృజనాత్మకశక్తిని పెంపొందించి శాస్త్రవేత్తలుగా ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. మండల విద్యాశాఖాధికారి హేమలత ప్రదర్శనలు తిలకించి విద్యార్థుల ప్రతిభను ప్రశంసించారు. అలాగే మోడల్ స్కూల్ నందు ప్రిన్సిపాల్ మునస్వామి నాయక్ ఆధ్వర్యంలో ఘనంగా సైన్స్‌డే నిర్వహించి, ప్రతిభ విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఆకట్టుకున్న విజ్ఞాన మేళా

పెద్దమండ్యం: సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన ప్రయోగాలు ఎంతో ఆకట్టుకున్నాయి. మండలంలోని మోడల్‌పాఠశాల, వెలిగల్లు, కలిచెర్ల, పెద్దమండ్యం, యల్లంవారిపల్లె ఉన్నత పాఠశాలల్లో సైన్స్ దినోత్సవాన్ని మంగళవారం జరుపుకొన్నారు. ఈ సందర్భంగా విజ్ఞానమేళాలో విద్యార్థులు తయారు చేసిన ప్రయోగాల వినియోగం, వాటి ప్రయోజనాలపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులకు వివరించారు. కలిచెర్లలో విజ్ఞాన మేళాను ఎంపీపీ పూర్ణచంద్రిక, ఎంపీడీవో శ్రీధర్‌రావు, మోడల్ పాఠశాలలో ప్రిన్సిపల్ రామాంజులునాయక్ ప్రారంభించారు.

ఆలోచన శక్తి, పోటీతత్వం పెరుగుతుంది

తంబళ్లపల్లె: సైన్సు ప్రదర్శనతో విద్యార్థుల్లో ఆలోచన శక్తితోపాటు పోటీతత్వం పెరిగి వారిలోని సృజనాత్మక శక్తి బహిర్గతం అవుతుందని ఎంఈవో త్యాగరాజు తెలిపారు. మంగళవారం మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ జాతీయ సైన్సు దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. భారతరత్న, నోబుల్ బహుమతి గ్రహీత, డాక్టర్ సివి రామన్ చిత్రపటాలకు పూలమాలలతో పూజలు చేసి ఘనంగా నివాళులర్పించారు.

ఆకట్టుకున్న సైన్స్ నమూనాలు

ములకలచెరువు: జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా మంగళవారం మండలంలోని సోంపల్లె ఉన్నత పాఠశాల, మోడల్‌స్కూల్, దేవులచెరువు ఉన్నతపాఠశాలలో వైజ్ఞానిక మేళ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాల్లో విద్యార్థులు ప్రదర్శించిన పలు నమూనాలు ఆకట్టుకున్నాయి. ప్లాస్టిక్‌ను రీసైక్లింగ్ చేసి వాడుకొనే నమూన, నీటి శుద్ధి పరికరం నమూన, పవన విద్యుత్ తయారి విధానం నమూనాలు ప్రదర్శించిన విద్యార్థులకు ఎంఈఓ వెంకటరమణ, హెచ్‌యం బాలసుబ్రమణ్యం బహుమతులను ప్రదానం చేసి అభినందించారు.

శాస్త్రీయ పరిజ్ఞానంతోనే అభివృద్ధి

కలకడ : శాస్త్రీయ, సైన్స్, పరిజ్ఞానంతోనే అభివృద్ధి, గుర్తింపు సాధ్యమని మండల విద్యాశాఖ అధికారి మునీంద్రనాయక్, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ మల్లంగ్‌షావల్లీ అన్నారు. మంగళవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో సైన్స్ ఎగ్జిబిషన్స్ ఏర్పాటు చేయించి ఉత్తమ ప్రతిభావంతులను ఎంపిక చేసి ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

పీలేరు : విద్యార్థులు తమ నైపుణ్యాలు పెంపొందించుకోవాలని రాయచోటి డీవైఈఓ ఆనంద్‌రెడ్డి అన్నారు. మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని పలు పాఠశాలల్లో విద్యార్థులు ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. స్థానిక అయ్యప్పరెడ్డి కాలనీలోని జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ప్రదర్శనలను డీవస్కో పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ విజ్ఞాన శాస్త్రంలో విద్యార్థులు పట్టు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జయమ్మ, ఉపాధ్యాయులు, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవం

కేవీపల్లె : మండలంలోని పలు పాఠశాలల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. చిన్నకమ్మపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులు రూపొందించిన ప్రదర్శనలను ఎంఈవో రెడ్డిబాషా పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సైన్స్ ప్రాముఖ్యత, నూతన ఆవిష్కరణలు మానవాళికి ఎంతో ఉపయోగమన్నారు. సైన్స్ ప్రదర్శనల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు.

ఆకట్టుకున్న ప్రదర్శనలు

బి.కొత్తకోట: సైన్స్ డే పురస్కరించుకుని మంగళవారం మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు తయారు చేసిన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. నమూనాలను పాఠశాలల్లో ప్రదర్శించి అవి పనిచేసే విధానం, వాటి ఉపయోగాలను విద్యార్థులు వివరించారు. ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొనగా ఎంఈఓ రెడ్డిశేఖర్ విద్యార్థులను అభినందించారు. ఇలాంటి ప్రయోగాలు విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తాయని అన్నారు.


మదనపల్లె సిటీ : ఎగ్జిబిట్‌ను పరిశీలిస్తున్న డీవైఈఓ క్రిష్ణప్ప


తంబళ్లపల్లె: సైన్సు ప్రయోగ ప్రదర్శనను పరిశీలిస్తున్న ఎంఈఓ త్యాగరాజు

భావి శాస్త్రవేత్తలుగా ఎదగాలి

వాల్మీకిపురం: నేటి విద్యార్థులే రేపటి శాస్త్రవేత్తలు అని మండల విద్యాశాఖ అధికారి వెంకటరత్నం అన్నారు. మంగళవారం మండల వ్యాప్తంగా ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సైన్స్ మేళాలను నిర్వహించారు. స్థానిక పీవీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల, జెడ్పీ బాలికోన్నత పాఠశాల, చింతపర్తి, గండబోయనపల్లి, మంచూరు జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో సైన్స్ దినోత్సవం సందర్భంగా వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు అమరనాథ రెడ్డి, శ్రీదేవి, సుబ్బారెడ్డి, శ్రీనివాస్, అరుణ, జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ రవీంద్ర రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సైన్స్ ఫేర్‌లో విద్యార్థుల ప్రతిభ

పెద్దతిప్పసముద్రం: మండలంలోని అన్ని క్లస్టర్ పాఠశాలల్లో మంగళవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైన్స్ ఫేర్ కార్యక్రమంలో విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల నమూనాలు చూపరులను ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా ఎంఈఓ నారాయణ మాట్లాడుతూ విద్యార్థుల్లో దాగి వున్న సృజనాత్మకతను వెలికి తీయడమే సైన్స్ ఫేర్ ముఖ్య ఉద్దేశమన్నారు. అనంతరం ప్రతిభ కనబరచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు.


ములకలచెరువు: సైన్స్ నమూనాలను పరిశీలిస్తున్న అధికారులు


పీలేరు : సైన్స్ ప్రదర్శనలను పరిశీలిస్తున్న డీవైఈఓ ఆనంద్‌రెడ్డి



వాల్మీకిపురం: విద్యార్థుల ప్రయోగాలను పరిశీలిస్తున్న ఎంఈఓ వెంకటరత్నం


పెద్దతిప్పసముద్రం: కందుకూరులో ఎంఈఓకు నమూనా గురించి వివరిస్తున్న బాలిక

వైభవంగా ధ్వజారోహణం

గుర్రంకొండ: మండలంలోని తరిగొండ గ్రామంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారి ధ్వజారోహణం కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మొదటిరోజైన మంగళవారం ఉదయాన్నే మూలవర్లకు స్నపన తిరుమంజనం కావించారు. తోమాలసేవ, ఏకాంత సేవలతో ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలు జరిగే పది రోజుల పాటు ఆలయానికి, ఉత్సవాలకు, యజ్ఞ యాగాలకు సంరక్షణగా ముక్కోటి దేవతలు ఉండాలని కోరుకొంటూ వారిని ఆహ్వానిస్తూ ధ్వజారోహణం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం భేరితాండవం నిర్వహించి దేవతాహ్వానం కావించారు. ఈసందర్భంగా గరుఖ్మంతునికి భక్తిశ్రద్ధలతో నైవేద్యం సమర్పించారు. తదనంతరం నైవేద్యంగా ఉంచిన ప్రసాదాలను సంతానం లేని మహిళలు స్వీకరిస్తే గరుఖ్మంతుని కృపతో సంతానం కలుగుతుందని భక్తుల నమ్మకం. దీంతో


ఆలయంలో ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకులు

కొంతమంది మహిళలు ఆలయానికి చేరుకొని సంతాన ప్రాప్తి కలిగించే ధ్వజారోహణ ప్రసాదాన్ని స్వీకరించారు. ఊంజల్ సేవ కానిచ్చి వాహన మండపంలో స్వామివారి వాహనాన్ని రంగురంగుల పుష్పాలతో అలంకరించారు. స్వామివారిని హంస వాహనంపై కొలువు దీరి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. కార్యక్రమంలో టీటీడీ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

బ్యాలెట్ బాక్సుల పరిశీలన

మదనపల్లె : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఉన్న బ్యాలెట్ బాక్సులను తహసీల్దార్ సీకే.శ్రీనివాసులుతో కలిసి ఆర్డీఓ ఎం.ఎస్.మురళి పరిశీలించారు. రిపేరీలు చేయదగినవి, లోపల శుభ్రం చేసినవి, మరకలు లేకుండా ఉన్నవి ఎంపిక చేసి సిద్ధంగా ఉంచాలన్నారు. వాటిని జెడ్పీహైస్కూల్‌లో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూమ్‌కు తరలించి భద్రపరచాలని ఆదేశించారు. మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమలు విషయంలో నిర్లక్ష్యం వద్దని, ఫిర్యాదులు ఉంటే వాటిని పరిశీలించి తగుచర్యలు తీసుకోవాలని, పోలింగ్ కేంద్రాలు, బ్యాలెట్‌బాక్సులు సిద్ధం చేసి పెట్టుకోవాలని సూచించారు.

కంటిచూపుపై ప్రత్యేక శ్రద్ధ

నిమ్మనపల్లె : కంటిచూపుపై ప్రతిఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ చూపాలని కంటి వైద్యాధికారి అర్జునరెడ్డి అన్నారు. మంగళవారం జాతీయ అంధత్వ నివారణ ప్రణాళికలో భాగంగా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జులేఖాబేగం ఆదేశాల మేరకు రెడ్డివారిపల్లె మోడల్ స్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులకు కంటి పరీక్షలు నిర్వహించారు. పాఠశాల సిబ్బందితో పాటు 352 మంది విద్యార్థులకు కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సర్వేంద్రియానాం నయనం ప్రధానమ్ అని, ప్రతి జీవికి కంటిచూపు అతి ముఖ్యమైనదన్నారు. కంటిచూపు మెరుగుపరచుకునేందుకు విటమిన్–ఏ కలిగిన ఆకుకూరలు, పండ్లు, కాయగూరలు, పాలు, గుడ్లు, చేపలు తదితర ఆహారాన్ని తీసుకోవాలన్నారు. టీవీ, సెల్‌ఫోన్ చూడటం సాధ్యమైనంతమేరకు తగ్గించుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కే.ఎస్.ఎన్.మూర్తి, సీహెచ్‌ఓ మల్లిక, ఎంపీహెచ్‌ఈఓ రామచంద్ర, సూపర్‌వైజర్ శ్రీనివాసులు, ఎంహెచ్‌ఎల్పీ నందిని, ఏఎన్‌ఎం ధనంజయమ్మ, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థులను గెలిపించండి

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి చంద్రశేఖర్‌రెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి పేర్నాటి శ్యామ్ ప్రసాద్‌రెడ్డిలను గెలిపించాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కార్యకర్తలు కలసి కట్టుగా పని చేసి నియోజకవర్గంలో అత్యధిక మెజారిటీ సాధించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ కల్పలతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవీ. శ్రీనాథరెడ్డి, నియోజకవర్గ పరిశీలకులు సహదేవరెడ్డి, ఏపీఎండీసీ డైరెక్టర్ హరీష్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఆఘామొహిద్దీన్, జెడ్పీటీసీ ఎ.టి. రత్నశేఖర్‌రెడ్డి, సర్పంచ్‌లు డాక్టర్ హబీబ్‌బాషా, జగన్‌మోహన్‌రెడ్డి, జెడ్పీ కోఆప్టెడ్ సభ్యుడు షఫీ పాల్గొన్నారు.

శ్యామ్ ప్రసాద్‌రెడ్డిని గెలిపించుకుందాం

వాల్మీకిపురం: పట్టుభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన పేర్నాటి శ్యామ్ ప్రసాద్ రెడ్డి గెలుపునకు పార్టీ నాయకులు కృషి చేయాలని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి పట్టణంలోని పురవీధుల్లో ఎమ్మెల్యే చింతల ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. పట్టభద్రులంతా కలసి శ్యామ్‌ప్రసాద్ రెడ్డికి మొదటి ప్రాధాన్యతగా ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నీళ్లభాస్కర్, కేశవ రెడ్డి, అబ్దుల్ కలీమ్, రాయుడు, మదనమోహన్ రెడ్డి, రఘు, రెడ్డెప్ప, సత్య, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.


ఓటర్లను అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే చింతల

మెగా మహా కరుణ శాఖాహార శాంతి ర్యాలీ

ములకలచెరువు: స్థానిక మండల కేంద్రంలో పిరమిడ్ సేవాదళ్ ఆధ్వర్యంలో మంగళవారం మెగా మహా కరుణ శాఖాహార శాంతి ర్యాలీ నిర్వహించారు. అనంతరం టీటీడీ కళ్యాణ మండపంలో నిర్వహించిన సమావేశంలో పిరమిడ్ సేవాదళ్ జిల్లా కన్వీనర్ కృష్ణప్ప, డిప్యూటీ కన్వీనర్ చలపతి శాఖాహారం విశిష్టత, ధ్యానం వలన కలిగే ప్రయోజనాలపై వివరించారు. జగద్గురు బ్రహ్మర్షి పితామహా పత్రీజీ మార్గదర్శకంతో పిరమిడ్ సేవాదళ్ స్థాపించినట్లు చెప్పారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాండు రంగయ్యశెట్టి, పరమేశ్వర్‌రెడ్డి, శివ, కంచి రఘురాం, రామిరెడ్డి, బండి శ్రీనివాసులు, ఏవి సుబ్బిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


వేదికపై పిరమిడ్ మాస్టర్లు, సేవాదళ్ సభ్యులు

టైలర్ల అభివృద్ధికి సహకారం అందిస్తాం

పీలేరు రూరల్ : టైలర్ల అభివృద్ధికి సహకారం అందిస్తామని సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా అన్నారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ సర్కిల్‌లో టైలర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కేక్‌కట్ చేసి పంచిపెట్టారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సర్పంచ్ మాట్లాడుతూ టైలర్ల అభ్యున్నతికి ప్రభుత్వం రూ.10 చొప్పున అందిస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కురబలకోట: టైలర్ల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని ఎంపీపీ బి. దస్తగిరి అన్నారు. మంగళవారం మండలంలోని అంగళ్లులో జరిగిన టైలర్స్‌డేలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడుతూ ఈ వృత్తి ప్రపంచ వ్యాప్తంగా ఎందరికో ఉపాధి కల్పిస్తోందన్నారు. టైలర్లు లేని సమాజాన్ని ఊహించలేమన్నారు.

బి.కొత్తకోట: టైలర్ల దినోత్సవం సందర్భంగా మంగళవారం బి.కొత్తకోటలో టైలర్లు ర్యాలీ నిర్వహించారు. బీసీ కాలనీ నుంచి దిగువబస్టాండు వరకు ర్యాలీ జరిపి నినాదాలు చేశారు. అనంతరం జరిగిన సభలో టైలర్ల సంఘం రాష్ట్ర ప్రతినిధి గోవింద్ తదితరులు వారి సమస్యలపై మాట్లాడారు.

వాల్మీకిపురం: వాల్మీకిపురంలో మంగళవారం టైలర్స్ డేని ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించి, మహాత్మగాంధీ, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా జేవీవీ ఆవిర్భావ దినోత్సవం

వాల్మీకిపురం: జనవిజ్ఞాన వేదిక ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జేవీవీ అధ్యక్షుడు ప్రభుచరణ్ మాట్లాడుతూ పూర్వ ఉమ్మడి తెలుగు రాష్ట్రంలో సైన్సు ఫలితాలు ప్రజలకు చేకూరాలని, సైన్సు ప్రజల జీవితాలలో విజ్ఞాన దీపిక కావాలని కోరుకునేవారందరూ ఒక గొప్ప ఆశయానికి శ్రీకారం చుట్టారన్నారు. ఆ సమష్టి కృషి ఫలితంగా 1988 ఫిబ్రవరి 28వ తేదిన విజయవాడలో జనవిజ్ఞాన వేదిక ఆవిర్భవించిందన్నారు. సమాజంలో పాతుకుపోయిన మూఢ విస్వాసాలను నియంత్రించడంతో పాటు నిరక్షరాస్యత నిర్మూలన, మద్యపాన నిషేధం విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణ వంటి లక్షణాలతో జనవిజ్ఞాన వేదిక ఏర్పడిందన్నారు. డాక్టర్ ఫైరోజా బేగం, డాక్టర్ శ్రీలక్ష్మి, నర్సులు గోవిందమ్మ, రజిత, లావణ్య, ఆసుపత్రి సిబ్బంది భాస్కర పాల్గొన్నారు.


రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొలతల్లో తేడాలు వస్తే చర్యలు

గుర్రంకొండ: పెట్రోలు, డీజిల్ కొలతల్లో తేడాలు వేస్తే చర్యలు తప్పవని తహసీల్దార్ ఖాజాబీ, వాల్మీకిపురం సివిల్ సప్లయ్స్ డీటీ వెంకట్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఖండ్రిగగ్రామంలోని పెట్రల్ బంకుల్లో ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈసందర్భంగా పెట్రోలు, డీజిల్ నాణ్యతను పరిశీలించారు. వినియోగదారుల వాహనాల పట్టించే డీజిల్, పెట్రోల్ కొలతల తేడాను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు పెట్రోల్‌బంకు నిర్వహించుకోవాలన్నారు. వినియోగదారులు ఎవరైనా ఫిర్యాదులు చేస్తే విచారించి చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ చంద్రశేఖర్, వీఆర్వోలు నాగరాజు, అన్వర్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపటి నుంచి యోగా తరగతులు

పీలేరు రూరల్ : స్థానిక కోటపల్లె శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం అనుబంధంలో ఉన్న శ్రీనివాస కల్యాణ మండపంలో గురువారం నుంచి యోగా తరగతులు ప్రారంభిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే జి.వి. శ్రీనాథరెడ్డి తెలిపారు. మంగళవారం కోటపల్లెలో యోగా కేంద్రం ప్రారంభోత్సవ కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షీ దివ్య యోగ విదాలయం ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రతి రోజూ ఉదయం ఒక గంట యోగా శిక్షణ ఉంటుందన్నారు. పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. యోగా చేయడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని పేర్కొన్నారు. కార్యక్రమంలో షీ సంస్థ అధ్యక్షురాలు పి.వి.ఎస్. లక్ష్మీ, న్యాయ సలహాదారు రాయల సుధాకర, నటరాజ కళామందిర్ నిర్వాహకురాలు హరిత, కోఆర్డినేటర్ కవిత, యోగా ఇన్‌స్ట్రక్టర్లు భాగ్యలక్ష్మీ, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

వేంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి

రామసముద్రం: మండలంలోని చెంబకూరులో వెలసిన శ్రీగట్టు వెంకటరమణస్వామి బ్రహ్మోత్సవాలు గురువారం అంకురార్పణతో ప్రారంభంకానున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 2న అంకురార్పణ, 3న ధ్వజారోహణం, సూర్యప్రభవాహనం, 4న సింహవాహనం, 5న శేషవాహనం, 6న హనుమంతవాహనం, 7న గజవాహనం, 8న కళ్యాణోత్సవం, గరుడోత్సవం, 9న రథోత్సవం, 10న దోపోత్సవం, 11న వసంతోత్సవం, ధ్వజారోహణం, 12న పుష్పపల్లకి, 13న శయణోత్సవం, 14న మేలుకొలుపుతో బ్రహ్మోత్సవాలు ముగియనున్నట్లు తెలిపారు. ప్రతి ఏటా శ్రీగట్టు వెంకటరమణస్వామి ఉత్సవాలు వైభవంగా నిర్వహించడం ఆనవాయితీ. ఉత్సవాలకు ఆంధ్ర, కర్నాటక, తమిళనాడు మూడు రాష్ట్రాల భక్తులు హాజరవుతారని నిర్వాహకులు తెలిపారు.

